క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నరేందర్ (ఫైల్)

ఇటిక్యాల: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన నరేందర్ (20) అదే గ్రామానికి చెందిన మరో ఎనిమిది మందితో కలిసి సోమవారం రాత్రి వినాయకుడి నిమజ్జనం కోసం ట్రాక్టర్‌లో బీచుపల్లి కృష్ణానది వద్దకు వెళ్తున్నారు. జాతీయ రహదారిపై కొట్టం కాలేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో కర్నూల్ ప్రభుత్వాసుపత్రి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వినాయక నిమజ్జనం ప్రమాదంలో గతంలో గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, యువకుడి మృతితో మృతుల సంఖ్య మూడుకి చేరింది. ఒక్కసారిగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు కారు బోల్తాపడిన సంఘటన బుధవారం రాత్రి గద్వాల మండలంలోని జమ్మిచేడ్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి మల్దకల్ మండలంలోని సొంత వ్యవసాయ పొలం చూసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారులో వెళ్తున్న క్రమంలో జమ్మిచేడ్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కారు పాక్షికంగా ధ్వంసం కాగా నర్సింహారెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు.

నేడు బహిరంగ వేలం

గద్వాల క్రైం: పోలీసు శాఖకు సంబంధించిన వాహనాల సామగ్రికి నేడు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సాయుధ బలగాల కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల సమయంలో బహిరంగ వేలం ఉంటుదన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రాఘవ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల బేస్‌మెంట్ లెవల్ పూర్తయినవారికి బిల్లులు అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని కార్మికుల రాష్ట్ర సదస్సుపై గోడ పత్రికను కార్మికులు ఆవిష్కరించారు. బుధవారం మండల కేంద్రంలోని కార్మికులు ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ కోరారు. కార్మికుల వేతనాలను పెంచాలని, ఉద్యోగ, ఉపాధి, భద్రత, పని ప్రదేశంలో రక్షణ, సమాన పనికి సమాన వేతనం, 8 గంటల పని సమయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పరుశరాముడు, నాగేష్, మద్దిలేటి, సంధ్యారాణి, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం

ధరూరు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. బుధవారం మండల పరిధిలోని బూరెడ్డిపల్లి, ఓబులోనిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. రికార్డులు, హాజరు రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ 100 శాతం పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

అయిజ: పట్టణంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 19వ వార్డులో లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పిదాలు జరిగాయని, దీంతో కొంతమంది అర్హులకు ఇళ్లు మంజూరు కాలేదన్నారు. తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నంలో అధికారులు ఉన్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరేది?



నందిన్నె శివారులోని 104 ప్యాకేజీ కాల్వ దుస్థితి

- 104 ప్యాకేజీ కాల్వల్లో పారని నీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

కేటీదొడ్డి: ఓ వైపు సాగు చేసిన పంటలకు యూరియా దొరక్కా.. మరో వైపు పంటలకు సాగు నీరందకా అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తలాపున కృష్ణానది పారుతున్న ఆయకట్టు కాల్వల ద్వారా ఖరీఫ్, రబీ పంటలకు సాగు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎడమ కాల్వలో పారని నీరు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ జలాశయాల నుంచి వందల టీఎంసీల వరద నీరు వచ్చి చేరుతోంది. కానీ జూరాల డ్యాంపై ఆధారపడిన ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్ ఎడమ కాల్వ నుంచి సాగుకు నీరందించే కాల్వలు వట్టిపోతున్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో సాగుకు నీరందించే కాల్వలకు నీరందిస్తారన్నా ఆశతో మండలంలో ఆయా గ్రామాల్లో రైతులు వరి, పత్తి తదితర పంటల సాగు చేశారు. 104 ప్యాకేజీ శాపంగా మారడంతో చివరి ఆయకట్టు రైతాంగానికి సాగునీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ర్యాలంపాడు రిజర్వాయర్ పైనే ఆశలు

ర్యాలంపాడు రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వ ద్వారా ధరూర్, కేటీదొడ్డి, గట్టు మల్దకల్ మండలాల్లోని గ్రామాల్లో వేల ఎకరాలకు సాగు నీరందిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ర్యాలంపాడు రిజర్వాయర్‌కు లీకేజీ ఏర్పడటంతో 4 టీఎంసీల ఉన్న రిజర్వాయర్ 2 టీఎంసీలకే పరిమితమైంది. దీంతో ఆయకట్టు మీద ఆధారపడిన రైతాంగాన్నికి ఒక్క పంటకు సాగు నీరందించే దుస్థితి నెలకొంది. రిజర్వాయర్ మరమ్మత్తులు పూర్తయితే కానీ రెండు పంటలకు సాగు నీరందించలేరు.

అందని సాగునీరు

ర్యాలంపాడు రిజర్వాయర్ ఎడమ కాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు సాగు నీరందించేదుకు 104 ప్యాకేజీ కింద సుమారు 30 కి.మీ. మేర కాల్వ నిర్మాణం చేపట్టారు. దీంతో ధరూర్, కేటీదొడ్డి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరందుతోంది. 104 ప్యాకేజీ కాల్వకు మొత్తం 13 షట్టర్లు ఉండగా అందులో 7 షట్టర్లు కేటీదొడ్డి మండలంలోనే ఉన్నాయి. అయితే కేటీదొడ్డి మండలంలో మైలగడ్డ, పాతపాలెం, కొండాపురంలో 104 ప్యాకేజీ కాల్వ షట్టర్లను రైతులు తెరవడంతో చివరి ఆయకట్టు గ్రామాలైన వెంకటాపురం, ఇర్కిచేడు, గువ్వలదిన్నె, నందిన్నె గ్రామాలకు సాగునీరందడం లేదు. అంతే కాకుండా ప్రధాన కాల్వ నుంచి చేపట్టిన లైనింగ్ పనులు సరిగా చేయకపోవడంతో నీరు లీకేజీ కావడంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న పంట కాల్వలకు మరమ్మతు చేపట్టి అసంపూర్తిగా ఉన్న కాల్వలను పూర్తి చేయించి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



చివరి ఆయకట్టు నందిన్నెకు నీరు రావడం లేదని చూపిస్తున్న రైతులు

నీరందడం లేదు



104 ప్యాకేజీ కాల్వలు అధ్వానంగా మారాయి. దీంతో చివరి అయకట్టుకు సాగునీరు అందడం లేదు. లైనింగ్ దెబ్బతిని పిచ్చి మొక్కలు మొలచి అధ్వాన్నంగా ఉన్నాయి. మరమ్మతు చేసి నీరు లీకేజీ కాకుండా చూడాలి. తక్షణమే చివరి అయకట్టుకు సాగునీరు అందించాలి.

– తిమ్మయ్య, రైతు, నందిన్నె

విడుదల చేశాం

ర్యాలంపాడు రిజర్వాయర్ 104 ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేశాం. కొండాపురం, గువ్వలదిన్నె శివారు వరకు పారుతున్నాయి. రెండు రోజుల క్రితం పూర్తిగా పారి ఆగిపోయింది. కాల్వల్లో రైతులు మోటార్లు వేయడం, నాసు పేరుకపోడంలో ముందుకు పోవడం లేదు. నాచు, ముళ్ల కంపలను పూర్తిగా తొలగించి చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ

బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపాలి



నందిన్నెలో హోటల్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



గట్టు శివారు పొలంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పొలం బాట పట్టారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గుతున్న తరుణంలో కాంప్లెక్స్ హెచ్ఎం నల్లారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి పొలం బాట పట్టారు. గట్టు, సల్కాపురం గ్రామాల్లో పర్యటించారు. బడిఈడు పిల్లలు పొలం పనుల్లో నిమగ్నమైన తరుణంలో ఉపాధ్యాయుల బృందం నేరుగా బడిఈడు పిల్లలు పనులు చేస్తున్న పొలాల దగ్గరకు వెళ్లారు. విద్య ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారుల చేత పనులు చేయించడం నేరమని, పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులుగౌడ్, తెలుగు నర్సింహులు, వీరేష్, రమేష్, పరుశరాం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

కేటీదొడ్డి: బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నందిన్నె పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా బడికి పంపించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ఇంటింటికి తిరిగి విద్యార్థుల గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి



వేరుశనగ పంట పరిశీలిస్తున్న ఏఈఓ నరేష్

ఎర్రవల్లి: రైతులు వానాకాలంలో సాగు చేసిన వివిధ పంటల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తిమ్మాపురం క్లస్టర్ ఏఈఓ నరేష్ అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా బుధవారం మండల పరిధిలోని బి.వీరాపురం పంటలను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. అనంతరం వేరుశనగ పంట పరిశీలించి చీడపీడలు గుర్తించారు. వేరుశనగ పంట పూత దశలో ఉండటం వల్ల జిప్సం లేదా సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎరువులు వేయాలని సూచించారు. ముసురు వర్షాల వల్ల అక్కడక్కడ పచ్చ పురుగు ఉధృతి ఉందన్నారు. దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం, ఎస్‌జీను 150 గ్రాములు లేదా క్లోరాన్‌ట్రనిలిప్రోల్ 18.5శాతం ఎస్‌ఎల్‌ను 100 ఎం.ఎల్ చొప్పున 120 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేస్తే పురుగు నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

సులభతరంగా బోధన చేయాలి



ధ్రువపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు

మల్దకల్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభతరంగా బోధన చేసి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన 150 ప్రదర్శనలు పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ మాట్లాడుతూ.. టీఎల్ఎం అనేది బోధనను సరళతరం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు టీఎల్ఎంను ఉపయోగించి విద్యా బోధనను కొనసాగించాలని సూచించారు. తహసీల్దార్ ఝాన్సీరాణి, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రదర్శనలను వీక్షించారు. అనంతరం ప్రదర్శనలో ఎంపికైన వారికి షీల్డ్‌తో పాటు ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేష్, మహేష్, రమేష్, ఓబులేష్, ఆంజనేయగౌడ్, వెంకటయ్య, శాంతన్న, శంకర్, సుందర్, హరిప్రియ, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణన్ జయంతి వేడుకలు



బహుమతులు అందజేస్తున్న జైనడిగడ్డ యువత

గట్టు: మండల పరిధిలోని మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జైనడిగడ్డ యువత ఆధ్వర్యంలో డాక్టర్ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మండలస్థాయి వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతి ఇందువాసికి చెందిన సాహితి నిలువగా రూ.5,016 నగదుతో పాటు బహుమతిని అందజేశారు. ద్వితీయ బహుమతి గట్టు ఉన్నత పాఠశాలకు చెందిన అబ్రుత్ నిలిచి రూ.3,016 , తృతీయ బహుమతిని మాచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గెలిచి రూ. 1,516 అందుకున్నాడు. విజేతలకు బహుమతులు జైనగడ్డ యువత జిల్లా అధ్యక్షుడు పల్లేరాజు, రామకృష్ణ ముదిరాజ్, రమేష్‌గౌడ్ అందజేశారు. అనంతరం ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ వెంకటేశ్వర్లును జైనడిగడ్డ యువత సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం నల్లారెడ్డి, ఎస్ఓ గోపిలత, ఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, హెచ్ఎం కర్రెప్ప, జైనడిగడ్డ యువత జిల్లా అధ్యక్షుడు పల్లేరాజు, కన్వీనర్ రమేష్‌గౌడ్, మాజీ కన్వీనర్ రామకృష్ణ, డాక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల



అమరవాయిలో బియ్యం పంపిణీ చేస్తున్న మహ్మద్ సిరాజ్‌అహ్మద్

మానవపాడు: తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేరుస్తుందని జిల్లా డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్‌అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని గోకులపాడు, అమరవాయి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోకులపాడులోని ఇందిరమ్మ నిర్మాణం లబ్దిదారులకు మొదటి విడతగా రూ.లక్ష వారి బ్యాంక్ అకౌంట్‌లో జమ అయినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, పరమేష్‌నాయుడు, నరసింహులు, తేజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలకు కేటాయించాలి



వడ్డేపల్లిలో సభ్యత్వం చేయిస్తున్న యూటీఎఫ్ నాయకులు

శాంతినగర్: జీఓ నంబర్ 317 బాధిత ఉపాధ్యాయులను తక్షణమే వారి సొంత జిల్లాలకు కేటా యించా లని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డేపల్లి యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయా లని కోరారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు యాదయ్య, అంజనేయులు,తిలక్, వెంకటేష్ పాల్గొన్నారు.

లంబోదరా.. మనవి ఆలకించరా



అయిజలో పూజలు చేస్తున్న భక్తులు

అలంపూర్/అయిజ/మల్దకల్/మానవపాడు: వినాయక చవితిని పురస్కరించుకొని కొలువుదీరిన గణనాథులకు బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలంపూర్ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం వినాయక కమిటీ ఆధ్వర్యంలో గరిక పూజలు విశేషంగా నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో చైతన్య యువజన సంఘం, అక్బర్‌పేట గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

- అయిజ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు.
- మల్దకల్ మండలంలోని నాగర్‌దొడ్డిలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు విక్రంసింహారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు తిరుమలేష్, భీమేష్, సతీష్, ముకేష్, శరత్, అశోక్, తిమ్మప్ప, కృష్ణ, బుడ్డన్న, వెంకట్రాములు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.
- మానవపాడు మండలకేంద్రంలోని నాగులకుంట కాలనీలోని వినాయక నిమజ్జనం ఉత్సాహంగా సాగింది. ఊరేగింపులో బుల్లితెర నటులు రన్నింగ్ రాజా, నటులు హర్షిత, సుధ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రన్నింగ్ రాజాతో యువకులు సెల్ఫీలు దిగారు.



అలంపూర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



నాగర్‌దొడ్డిలో పూజలు చేస్తున్న విక్రమసింహారెడ్డి, యూత్ సభ్యులు



మానవపాడులో నిమజ్జన ఉత్సవంలో టీవీ నటులు

పగటి వెలుగులు.. తెస్తున్న నష్టాలు



ఉండవెల్లిలో పగలు వెలుగుతున్న వీధిలైట్లు



బైరాపురంలో పగటి పూట వెలుగుతున్న వీధిలైట్లు

- భారంగా విద్యుత్ బిల్లులు
- వీధిలైట్లకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు లేక ఇబ్బందులు
- మీటర్లను ఏర్పాటు చేసినా పట్టింపు లేదు

ఉండవెల్లి: పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని వివిధ గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. చాలా చోట్ల ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసినా వాటిని ఉపయోగించడం లేదు. ఫలితంగా స్విచ్‌లు పనికి రాకుండా పోవడంతో పాటు విద్యుత్ వృథా అవుతుంది. సంబంధిత సిబ్బంది అలసత్వం కారణంగా పంచాయతీలకు బిల్లులు అధికంగా వస్తున్నాయి. గ్రామాల్లో వివిధ పనులు చేయడానికి నిధుల్లేక కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ వృథాపై మాత్రం దృష్టి సారించడం లేదు. మీటర్లు వినియోగించి పగలు బంద్ చేస్తే బిల్లు భారం తగ్గుతుంది.

నిరంతరం పగటి వెలుగులే

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. వాటిని బంద్‌చేసే వారు కరువైనట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధి దీపాలతో పాటు హైమాస్ట్ దీపాలను పగటిపూట బంద్ చేయడం లేదంటున్నారు.

నెలకు రూ.2 లక్షలు

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో వీధి స్తంభాలు, నీటి సరఫరాకు అందించే మోటార్లకు నెలకు రూ.2 లక్షల వరకు విద్యుత్ బిల్లులు వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాటిని ప్రభుత్వం ట్రాన్స్‌కోకు చెల్లిస్తోంది. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసే సమయంలో కరెంటు బిల్లులు మినహాయించుకుంటుంది. బిల్లులు భారం తగ్గించుకుంటే ఆ నిధులను గ్రామాల్లో వేరే పనులకు వినియోగించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

పంచాయతీలదే బాధ్యత

గ్రామాల్లో వీధి దీపాల నియంత్రణ బాధ్యత పంచాయతీలదేనని విద్యుత్ అధికారులు అంటున్నారు. వీధి దీపాలు నిరంతరం వెలగకుండా వీధి దీపాలకు థర్డ్‌వైర్ ఏర్పాటు చేసుకోవాలని, దీంతో పాటు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసుకొని వాటిని బంద్ చేయడం పంచాయతీల బాధ్యతే అంటున్నారు. విద్యుత్ వృథా కాకుండా, బిల్లులు చెల్లించే బాధ్యత పంచాయతీ అధికారులదే అని పేర్కొంటున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



గ్రామ పంచాయతీల్లో వీధి దీ పాలు నిరంతరం వెలుగుతున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో పగటి వెలుగులు లేకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల కార్యదర్శి

సమీక్షించి సరిచేస్తాం

గ్రామాల్లో వీధి దీపాలు పగలు వెలిగే విషయంపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించి తగిన చ ర్యలు తీసుకుంటాం. ఆన్,ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసి పగటిపూట వెలగకుండా చూస్తాం. బిల్లులు అధి కంగా వస్తే పంచాయతీలకే నష్టం జరుగుతుంది. అభివృద్ధి పనుల నిధులకు ఇబ్బంది ఏర్పడుతుంది.

– తిరుపతన్న ఎంపీడీఓ, ఉండవెల్లి